క్లుప్తంగా

సత్యసాయి మందిరంలో లక్ష మల్లెల అర్చన



నందిగామ: పట్టణంలోని రైతు పేటలో గల సత్య సాయిబాబా మందిరంలో శ్రావణ మాసం శుక్రవారం నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారికి లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. ముందుగా మందిరంలోని సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలతో పాటు లక్ష మల్లెలతో అర్చన చేయించారు. ఆయా పూజా కార్యక్రమాలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

తల్లి పాలు పిల్లలకు వరం

వత్సవాయి: తల్లిపాలు పిల్లలకు వరం లాంటివని ఐసీడీఎస్ ఏసీడీపీవో నాగమణి తెలిపారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా చిల్లకల్లు ప్రాజెక్ట్ పరిధిలో భీమవరం సెక్టార్‌లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పక తాగించాలని చెప్పారు. దీనివల్ల బిడ్డలో రోగనిరోధకశక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

2,354 సీసీఆర్సీ కార్డులు పంపిణీ

పెనుగంచిప్రోలు: మండలంలో ఈ ఏడాది కౌలు రైతులకు 2,354 పంట సాగు హక్కు ధృవీకరణ పత్రాలు అందజేసినట్లు తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. 2022–23 ఏడాదికి సంబంధించి 2,566 కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది 3,154 లక్ష్యం కాగా, ఇప్పటికే 2354 కార్డులు అందజేశామని, మిగిలిన వారికి కూడా అందిస్తామన్నారు.

60 శాతం పింఛన్‌ల అందజేత



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం 60 శాతం పింఛన్‌లు అందజేసినట్లు ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం తెలిపారు. 17 గ్రామాలలోని అన్ని సచివాలయాల పరిధిలో వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి అన్ని రకాల పింఛన్‌లు అందజేశారని చెప్పారు. పింఛన్‌ల పంపిణీ పర్యవేక్షణ ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

మండలానికి 542 కొత్త పింఛన్‌లు

మండలంలోని 17 గ్రామాలలో నూతనంగా 542 పింఛన్‌లు మంజూరయ్యాయని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మంజూరైన పింఛన్లను రెండు,మూడురోజుల్లో అందిస్తారన్నారు.

16 మందిపై కేసు నమోదు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు గ్రామాలలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ప్రజలను రెచ్చగొట్టి రాస్తారోకో నిర్వహించేందుకు కారకులైన 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కామాక్షి అమ్మవారికి వెండి వస్తువుల బహూకరణ

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని కామాక్షి అమ్మవారికి శుక్రవారం తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా మంగళంపల్లి గ్రామానికి చెందిన తుడి శ్రీనివాసరావు దంపతులు వెండి కవచం , వెండి చెవులు బహూకరించారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ఈవో శిరీష తెలిపారు.

రాజన్నా..నీ జ్ఞాపకాలు మా గుండెల్లో పదిలం

పెద్దాయన తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మహానేత. ఉభయ తెలుగు రాష్ట్ర ప్రజల గుండె చప్పుడు. ఆయన్ను ప్రజలు ఎప్పుడూ ఒక నాయకుడిలా చూడలేదు. తమ సొంత మనిషిగా, తమ కుటుంబంలో ఒకరిగానే భావించారు. అందుకే ఆయన మరణం కరడు గట్టిన హృదయాలను సైతం కంటతడి పెట్టించింది. మనసెరిగిన నేతగా, అన్ని వర్గాల ప్రజల కష్టాలు తెలిసిన నిజమైన ప్రజా నాయకుడిగా ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలం. నేడు మహానేత 14 వ వర్ధంతి సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.



చెరువుకొమ్ముపాలెం గ్రామానికి పల్లెబాట సందర్భంగా విచ్చేసిన సమయంలో రైతులతో కలసి అరక దున్నతున్న వైఎస్సార్ (ఫైల్)

నందిగామ: చంద్రబాబు పాలనలో కేవలం కార్పొరేట్ వ్యవస్థలకే పెద్దపీట వేశారు. వ్యవసాయంపై దృష్టి పెట్టలేదు. ఈ నేపథ్యంలో అప్పట్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ క్రమంలో 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో రైతుల దశ తిరిగింది. సమృద్ధిగా వర్షాలు పడటంతోపాటు పలు ఎత్తిపోతల పథకాలు నిర్మించడంతో రైతులు తిరిగి రాజులయ్యారు. వైఎస్ పాదముద్రతో పులకించిన నేల ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన తరువాత పల్లెబాటలో భాగంగా 2004, జూలై 7న మహా నేత వైఎస్ రాజశేఖర రెడ్డి నందిగామ మండలంలోని చెరువుకొమ్ము వారిపాలెం గ్రామంలో పర్యటించారు. రైతులతో కలసి పొలాల్లోకి నడుచుకుంటూ వెళ్లి పొలం దున్ని రైతులను వెన్ను తట్టి ప్రోత్సహించారు. ఆ సమయంలో ప్రజల సంతోషం, ఆనందం మాటల్లో వర్ణించలేనిది.



జగ్గయ్యపేట మండల పరిధిలోని వేదాద్రి వద్ద కృష్ణానదిపై వైఎస్సార్ హయాంలో నిర్మించిన భారీ ఎత్తిపోతల పథకం

వైఎస్సార్ హయాంలో మంజూరైన ఎత్తిపోతల పథకాలు :

- కృష్ణానదిపై వేదాద్రి వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఈ పథకం ద్వారా నేడు 17,366 ఎకరాలకు సాగునీరందుతుంది.
- చందర్లపాడు మండలం గుడిమెట్ల వద్ద కృష్ణానదిపై గుడిమెట్ల-తుర్లపాడు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ పథకం చందర్లపాడు మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరందిస్తోంది.
- కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద వైరా నదిపై రూ.99.50 లక్షలతో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించారు. దాని ఆయకట్టు 2,446 ఎకరాలు. అవేకాక గండేపల్లి, పేరకలపాడు, కంచికచర్ల గ్రామాల పరిధిలోని చెరువులు నింపుతారు. ఆ చెరువుల్లో నీటి ద్వారా మరో 1130 ఎకరాల భూమి సాగవుతుంది.

వ్యవసాయాన్ని పండుగలా మార్చారు



మహానేత పాలన ఎన్నటికీ మరువలేనిది. ఆయన పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. ముఖ్యంగా రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలిగేలా ఆయన పాలన కొనసాగింది. వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుంచి వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత మహానేతకే దక్కుతుంది.

– మంగునూరు కొండారెడ్డి, రాష్ట్ర అగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్

వైఎస్సార్ పాలన స్వర్ణ యుగం



మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన ఒక స్వర్ణ యుగం. ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆ రోజుల్లోనే దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు ఆలోచించేలా చేసిన మహనీయుడు వైఎస్సార్. నేటి రాజకీయ నాయకులకు ఆయన ఒక ఆదర్శం.

– బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు

మానవాభివృద్ధే నిజమైన అభివృద్ధి

- కీసరలో రూ.40 లక్షలతో సచివాలయ భవనం నిర్మాణం
- ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల(వీరులపాడు): మానవాభివృద్ధే నిజమైన అభివృద్ధి అని భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. కంచికచర్ల మండలం కీసర గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను రూపుమాపటంతో పాటు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ముఖ్యంగా గతంలో గ్రామ పంచాయతీ భవనాలు కూడా సరిగా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పరిటాల దివ్య, సర్పంచ్ పేరం నర్సమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, ఎంపీపీ మలక్ బషీర్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ చలమల ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యురాలు పొపట్ల సీత, నాయకులు పరిటాల రాము, వేల్పుల రమేష్, పొపట్ల స్వామి, పలువురు నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్తవుతున్న పోలంపల్లి ఆనకట్ట కాంక్రీట్ పనులు



పోలంపల్లి వద్ద జరుగుతున్న ఆనకట్ట కాంక్రీట్ పనులు



పూర్తయిన తువ్వ కాలువ గండ్లు పూడ్చివేత పనులు

- చివరి దశకు చేరుకున్న తువ్వ కాలువ గండ్లు పూడ్చివేత
- ప్రభుత్వవిప్ ఉదయభాను చొరవతో యుద్ధప్రాతిపదికన పనులు

పెనుగంచిప్రోలు: ఈ ఏడాది జూలై నెల 26, 27 తేదీల్లో వచ్చిన భారీ వరదలకు వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద నీటి నిల్వకు బ్రిటీషు వారి కాలంలో 1850లో మునేరుకు అడ్డంగా నిర్మించిన ఆనకట్ట రెండున్నర అడుగులు 65 మీటర్ల వరకు కొట్టుకుపోయింది. పెనుగంచిప్రోలు నుంచి గుమ్మడిదుర్రు వరకు మునేరు తువ్వ కాలువకు 38 చోట్ల గండ్లు పడ్డాయి. వెంటనే స్పందించిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లారు. వెంటనే మరమ్మతుల కోసం రూ.1.80 కోట్లు మంజూరు చేశారు. కాంక్రీట్ పనులు శనివారం కల్లా పూర్తవుతాయని ఇరిగేషన్ శాఖ ఈఈ గంగయ్య, డీఈ రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం వారు కాంక్రీట్ పనులను పరిశీలించారు. గండ్లు పూడ్చివేత చివరి దశకు చేరుకుంది. ఈ పనులు పూర్తవగానే కొద్ది రోజుల్లో రైతులకు మునేరు తువ్వ కాలువ ద్వారా నీళ్లు అందిస్తామన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆనకట్ట మరమ్మతు పనులు, గండ్లు పూడ్చి వేత పనులు జరగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



అమ్మవారి ప్రచార రథం ఊరేగింపు ప్రారంభంలో ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు, సిబ్బంది



పట్టణంలోని వాసవి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న సామూహిక పూజలు

పెనుగంచిప్రోలు: శ్రావణమాసం, మూడవ శుక్రవారం సందర్భంగా ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రచార రథంలో వత్సవాయి మండలంలోని గ్రామ దేవతలకు ఊరేగింపుగా వెళ్లి శ్రావణ పట్టీ కింద చీరె, జాకెట్ ముక్క, పూలు, పసుపు–కుంకుమ సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు దంపతులు, ధర్మకర్త ఎం.పద్మ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు జంగం ప్రసాద్, బి.కృష్ణప్రసాద్, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవార పూజలు

నందిగామ: శ్రావణ మాస మూడవ శుక్రవారం నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నందిగామ పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.పట్టణంలోని మరిడి మహాలక్ష్మమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో సుక శ్యామలాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు గావించారు. శ్రీపురంలో ఉన్న వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పట్టణ శివారుల్లోని పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యం

నందిగామ: తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ గ్రామంలో తొలగించిన, బదిలీ చేసిన ఓట్లకు సంబంధించి పలు ఇళ్లకు వెళ్లి స్వయంగా ఆయనే వెరిఫికేషన్ నిర్వహించారు. స్థానికులతో మాట్లాడడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ తొలగించిన, బదిలీ చేసిన ఓట్లకు సంబంధించి ప్రత్యేక వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

పెండ్యాలలో గ్రామసభ

కంచికచర్ల(వీరులపాడు): భూముల రీ సర్వేలో భాగంగా డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్, ల్యాండ్ పార్శిల్ నంబరు దాఖలా ప్రతి రైతు వివరాలను చదివి వినిపించినట్లు తహసీల్దార్ శంకర బాబు తెలిపారు. కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచికచర్ల, చెవిటికల్లు, మోగులూరు, వేములపల్లి గ్రామాల్లో రీ సర్వే ప్రారంభమవుతుందన్నారు. ప్రతి రైతు భూ వివరాలతో ఆయా గ్రామాల్లోని రెవెన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు. సర్పంచ్ మల్లిక భాను, అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



వార్డులో జరుగుతున్న ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 13వ వార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఫాగింగ్, నీళ్ల నిలువ ఉన్నచోట ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడం, ఎబేట్ ద్రావణం పిచికారీ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గద్దె రమేష్, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి



పౌష్టికాహారం పంపిణీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముండ్లపాడు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీతో పాటు పోషకాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాలా దీక్షల విరమణ మహోత్సవం



ఊరేగింపుగా వస్తున్న కాళీమాత మాలా దీక్షా స్వాములు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్డులో పుట్టబజారులో ఉన్న శ్రీకలకత్తా కాళీమాత విశ్వరూప శివదుర్గా భవానీ మాత అమ్మవారి ఆలయంలో అమ్మవారి 41 రోజుల దీక్ష స్వీకరించిన 30 మంది మాలా దీక్షా స్వాములు శుక్రవారం రాత్రి తమ దీక్షలను విరమించారు. ముందుగా పట్టణంలోని శ్రీరేణుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నుంచి శ్రీకలకత్తా కాళీ మాతధారులు మేళతాళాలతో కోదాడ రోడ్‌లోని పుట్టబజారులో ఉన్న శ్రీకాళీమాత ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీ భార్గవి అన్నారు. గ్రామంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు పోషణ అభియాన్, సమగ్ర పోషణ పథకం ద్వారా పోషణ మాసోత్సవాలు జరుగుతాయని తెలిపారు. పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన సదస్సులు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నది మేమే'

నందిగామటౌన్: దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆశయ సాధనకు కృషి చేస్తున్నది తామేనని బీసీ నాయకుడు అంగడాల పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న నకిలీ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని సూచించారు. ఎన్టీ రామారావు విగ్రహాన్ని తాను అప్పట్లో దేవినేని వెంకట రమణ, తంగిరాల ప్రభాకర రావు, నెట్టెం రఘురాంలతో కలిసి స్థాపించానన్నారు. గతంలో తెలుగుదేశంలో పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు ఎవరూ నేడు ఆ పార్టీలో పని చేయటం లేదన్నారు. ఆ విగ్రహాన్ని అడిగి తీసుకునే హక్కు తనకు మాత్రమే ఉందన్నారు. గాంధీ సెంటరులో తొలగించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని తనకు ఇవ్వాలని మున్సిపల్ అధికారులను కోరగా వారు ఇచ్చారని, ఆ విగ్రహాన్ని తాను ఇంటికి తీసుకెళ్లలేదని, గాంధీ సెంటర్‌లో సముచిత స్థానంలో ఉంచానని తెలిపారు. కొద్ది రోజుల్లో అక్కడ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు.

పేటలో నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 14 వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలోని విలియంపేట, బలుసుపాడు రోడ్, కోదాడ రోడ్, బస్టాండ్ సెంటర్, బైపాస్ రోడ్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద వర్ధంతి కార్యక్రమాలు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొని నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ముందుగా ఉదయభాను నివాసం నుంచి ర్యాలీగా బయలు దేరనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

పేట పట్టణంలో ఠంచన్‌గా పింఛన్ పంపిణీ



క్రిస్టియన్‌పేటలో గృహ సారథులతో కలసి పెన్షన్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని వార్డు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు నిర్వహించారు. పట్టణంలోని 31 వార్డుల్లో ఉన్న వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి పింఛనర్లకు వార్డు వలంటీర్లు బయోమెట్రిక్ వేలిముద్రలు, ఐరిస్, ఫేషియల్ ద్వారా పింఛన్ డబ్బులను అందజేశారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలోని 31 వార్డులకు గాను మొత్తం 4,815 మంది పింఛన్‌దారులకు గాను మొదటి రోజున 81.85 శాతం మందికి రూ.1,10,24,500 పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు.

1578 మంది కౌలు రైతులకు చేకూరిన లబ్ధి

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో నూతనంగా 1578 మంది కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా లభించిందని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. జగ్గయ్యపేటలో 442, పెనుగంచిప్రోలులో 442, వత్సవాయిలో 694 మంది కౌలు రైతులకు రూ.1.19 కోట్ల మేరకు లబ్ధి చేకూరినట్టు వివరించారు.